10-06-2014 ఉదయము మురళి ఓంశాంతి "బాప్‌దాదా" మధువనము

"మధురమైన పిల్లలారా - "సదా ఇదే నషాలో ఉండండి - మాది పదమా పదమ భాగ్యము, స్వయము పతిత పావనులైన తండ్రికి మేము పిల్లలుగా అయ్యాము, వారి నుండి మాకు బేహద్ సుఖ వారసత్వము లభిస్తుంది."

ప్రశ్న:- పిల్లలైన మీరు ఏ ధర్మమును కూడా తిరస్కరించరాదు, ద్వేషించరాదు ఎందుకు?

సమా :- ఎందుకనగా మీకు బీజము, వృక్షము గురించి తెలుసు. ఇది మానవ సృష్టిరూపి అనంతమైన వృక్షమని మీకు తెలుసు. ఇందులో ప్రతి ఒక్కరికి తమ తమ పాత్ర ఉంది. నాటకములో నటులెవరూ ఒకరినొకరు ద్వేషించుకోరు. ఈ నాటకములో మనము హీరో - హీరోయిన్ పాత్రను అభినయించామని మీకు తెలుసు. మనము చవి చూసిన సుఖమును ఇతరులెవ్వరూ చూడలేరు. పూర్తి విశ్వము పై మనము రాజ్యపాలన చేసేవారమని మీకు అపారమైన సంతోషముంది.

ఓంశాంతి. ఓంశాంతి అంటూనే ఇంతవరకు లభించిన జ్ఞానమంతయూ పిల్లల బుద్ధిలోకి వచ్చేయాలి. తండ్రి బుద్ధిలో కూడా ఏ జ్ఞానముంది? ఇది మానవ సృష్టి రూపి వృక్షము. దీనిని కల్పవృక్షమని కూడా అంటారు, దీని ఉత్పత్తి, పాలన వినాశనము ఎలా జరుగుతుందో అదంతా మీ బుద్ధిలోకి రావాలి.ఈ చైతన్య వృక్షము కూడా ఆ జడ వృక్షము వంటిదే. ఈ వృక్ష బీజము కూడా చైతన్యమే. సత్యము, చైతన్యము అని వారిని కూడా మహిమ చేస్తారు. అనగా వృక్ష ఆది - మధ్య - అంత్య రహస్యాలను తెలిపిస్తున్నారని వారిని మహిమ కూడా చేస్తారు. వారి కర్తవ్యము ఎవరికీ తెలియదు. ప్రజాపిత బ్రహ్మ కర్తవ్యమేమిటో తెలుసుకోవాలి కదా. బ్రహ్మను ఎవరూ స్మృతి చేయరు, వారి గురించి తెలియనే తెలియదు. అజ్మీర్‌లో బ్రహ్మ దేవాలయముంది. త్రిమూర్తి చిత్రములో బ్రహ్మ-విష్ణు-శంకరుల చిత్రాలను అచ్చు వేయిస్తారు. బ్రహ్మ దేవతాయనమః అని అంటారు. ఈ సమయములో ఉన్న బ్రహ్మను దేవత అని అనరని సంపూర్ణమైనప్పుడు దేవత అని అంటారని, సంపూర్ణమై సూక్ష్మవతనానికి వెళ్ళిపోతారని పిల్లలైన మీకు తెలుసు.

మీ తండ్రి పేరు ఏమిటి ? అని బాబా అడుగుతారు. ఎవరిని అడుగుతారు ? ఆత్మను "నా బాబా" అని ఆత్మ అంటుంది. జవాబు తెలియని వారు ప్రశ్న అడగలేరు. ఇప్పుడు అందరికీ ఇద్దరు తండ్రులున్నారని పిల్లలు తెలుసుకున్నారు. జ్ఞానము ఒక్క తండ్రి మాత్రమే ఇస్తారు. ఇతడు శివబాబా రథమని పిల్లలైన మీరు తెలుసుకున్నారు. బాబా ఈ రథము ద్వారా మనకు జ్ఞానాన్ని వినిపిస్తారు. ఒకటేమో ఇది - శరీరము గల బ్రహ్మ ఆత్మకు రథము, రెండవది - శరీరము లేని ఆత్మిక తండ్రికి కూడా రథము. ఆత్మిక తండ్రికి - సుఖసాగరులు, శాంతి సాగరులు.......... అని మహిమ ఉంది. మొదట వీరు బేహద్ తండ్రి అని, వీరి ద్వారా అనంతమైన వారసత్వము లభిస్తుందని బుద్ధిలో ఉంది. పవిత్ర ప్రపంచానికి అధికారులుగా అవుతారు. పతితపావనా రండి అని నిరాకార తండ్రిని పిలుస్తారు. పిలిచేది ఆత్మనే. ఆత్మ పవిత్రముగా ఉన్నప్పుడు తండ్రిని పిలువరు. పతితముగా ఉనప్పుడు పిలుస్తారు. ఆ పతితపావనులైన తండ్రి ఈ శరీరములో వచ్చారని ఆత్మలైన మీకు తెలుసు. మనము వారికి చెందినవారిగా అయ్యామని మరచిపోరాదు. ఇది సౌభాగ్యమే కాదు, పదమ్ భాగ్యపు విషయము. అటువంటి తండ్రిని ఎందుకు మరచిపోవాలి? ఈ సమయములో తండ్రి వచ్చారు - ఇది క్రొత్త మాట. శివజయంతి కూడా ప్రతి

సంవత్సరము జరుపుకుంటారు. కావున వారు ఒక్కసారి మాత్రమే వస్తారు. లక్ష్మీ నారాయణులు సత్యయుగములో ఉండేవారు. ఈ సమయములో వారు లేరు. వారు పునర్జన్మ తీసుకొని ఉంటారని తెలపాలి. 16 కళల నుండి 14-12 కళలకు వచ్చి ఉంటారు. ఇది మీకు తప్ప ఇతరులెవరికీ తెలియదు. సత్యయుగమని నూతన ప్రపంచమును అంటారు. అచ్చట అన్నియు కొత్తవిగా ఉంటాయి. దేవతా ధర్మము అను పేరు కూడా మహిమ చేయబడుతుంది. ఆ దేవతలే వామమార్గము (వేద విరుద్ధమైన తంత్రమంత్రములతో కూడి మద్య,మాంస,మైధునాలకు తావిచ్చేడి విధానము) లోనికి పోయినప్పుడు, వారిని క్రొత్తవారు అని కూడా పిలువరు, దేవతలని కూడా పిలువరు. మేము వారి వంశావళి అని కూడా ఎవ్వరూ అనరు. స్వయమును వారి వంశావళి అని భావిస్తే వారిని మహిమ చేస్తూ స్వయమును ఎందుకు నిందించుకుంటారు? దేవతలను మహిమ చేస్తున్నారంటే, వారిని పవిత్రముగా భావిస్తూ, స్వయమును అపవిత్ర పతితులుగా భావిస్తున్నారు. పావనము నుండి పతితులుగా అవుతారు, పునర్జన్మ తీసుకుంటారు. మొట్టమొదట ఎవరు పావనముగా ఉండినారో తర్వాత వారే పతితులుగా అయ్యారు. పావనము నుండి పతితమయ్యామని మీకు తెలుసు. మీరు పాఠశాలలో చదువుతున్నారు. నంబరువారుగా ప్రథమ, ద్వితీయ తరగతులు ఉంటాయి కదా.

మనలను తండ్రి చదివిస్తున్నారని ఇప్పుడు పిల్లలకు తెలుసు. కనుకనే వారు వస్తారు కదా. లేకుంటే ఇచ్చటకు వచ్చే అవసరము ఏమున్నది? ఇతను ఎలాంటి గురువు, మహాత్మ, మహాపురుషుడు కాదు. ఇతడిది కూడా సాధారణ మానవ శరీరమే. అది కూడా చాలా పాతది. అనేక జన్మల అంతిమములో ప్రవేశిస్తాను. అంతకంటే ఇతని(బ్రహ్మ)కి ఏ మహిమ లేదు. నేను ప్రవేశించినప్పుడే ఇతనికి ఈ పేరు ఉంటుంది. లేకుంటే ప్రజాపిత బ్రహ్మ ఎక్కడ నుండి వచ్చాడు? మనుష్యులు తప్పక తికమకపడతారు కదా. తండ్రి మనకు తెలిపించినందునే మీరు ఇతరులకు తెలిపిస్తారు. బ్రహ్మకు తండ్రి ఎవరు? బ్రహ్మ, విష్ణువు, శంకరుల రచయిత శివబాబా. బుద్ధి పైకి పోతుంది. ఇది పరంధామములో ఉన్న పరమపిత పరమాత్మని రచన. బ్రహ్మ, విష్ణువు, శంకరుల కర్తవ్యములు వేరు, వేరుగా ఉన్నాయి. ముగ్గురు నలుగురు కలిసి ఉంటే ఎవరి పని వారికుంటుంది. ఎవరి పాత్ర వారిదే. ఎన్ని కోట్ల ఆత్మలున్నాయి - కాని ఒకరి పాత్ర మరొకరితో కలవదు. ఈ అద్భుతమైన విషయాలన్నీ తెలిపించబడతాయి. అనేక మంది మనుష్యులున్నారు. ఇప్పుడు చక్రము పూర్తి అవుతుంది. ఇది అంతిమ సమయము కదా. అందరూ వాపసు వెళ్ళిపోతారు. మరలా చక్రము పునరావృతము అవుతుంది. తండ్రి ఈ విషయాలన్నీ రకరకాలుగా తెలిపిస్తూ ఉంటారు. క్రొత్త విషయము కాదు. కల్పక్రితము కూడా అర్థము చేయించి ఉంటిని అని అంటున్నారు వారు అత్యంత ప్రియమైన తండ్రి. అటువంటి తండ్రిని చాలా ప్రీతితో స్మృతి చేయాలి. మీరు కూడా తండ్రికి ప్రియమైన పిల్లలు కదా. తండ్రిని స్మృతి చేస్తూ వచ్చారు. మొదట అందరూ ఒక్కరినే పూజించేవారు. భేద భావము ఉండేది కాదు. ఇప్పుడు అనేక భేద భావాలు ఏర్పడ్డాయి. వీరు రాముని భక్తులు, వారు కృష్ణుని భక్తులు. రాముని భక్తులు ధూపము వెలిగిస్తే, కృష్ణుని భక్తులు ముక్కు మూసుకుంటారు. ఇటువంటి కొన్ని మాటలు కూడా శాస్త్రాలలో ఉన్నాయి. వారు మా భగవంతుడు గొప్పవారు అని అంటారు. వీరు నా భగవంతుడు గొప్పవారు అని అంటారు, ఇద్దరు భగవంతులు ఉన్నారని భావిస్తారు. ఇది తప్పు

భావమైనందున అన్నియు తప్పు పనులే, అన్యాయమైన పనులే చేస్తూ ఉంటారు.

తండ్రి తెలిపిస్తున్నారు - పిల్లలూ! భక్తి భక్తే, జ్ఞానము జ్ఞానమే. జ్ఞానసాగరులు ఒక్క తండ్రి మాత్రమే. మిగిలిన వారంతా భక్తిసాగరులు. జ్ఞానము వలన సద్గతి జరుగుతుంది. ఇప్పుడు పిల్లలైన మీరు జ్ఞానవంతులుగా అయ్యారు. తండ్రి మీకు తమ పరిచయమును, పూర్తి చక్రము యొక్క పరియచమును ఇచ్చారు. దీనిని ఇతరులెవ్వరూ ఇవ్వలేరు. అందువలన తండ్రి అంటున్నారు - "పిల్లలైన మీరు స్వదర్శన చక్రధారులు. పరమపిత పరమాత్మ అయితే ఒక్కరే." మిగిలిన వారంతా పిల్లలు. స్వయమును పరమపిత పరమాత్మ అని స్వయమును ఎవరూ చెప్పుకోలేరు. మంచి తెలివిగల మానవులు ఇది చాలా గొప్ప డ్రామా అని అర్థము చేసుకుంటారు. ఇందులోని పాత్రధారులందరూ అవినాశి పాత్రను అభినయిస్తారు. అచ్చట వినాశమయ్యే చిన్న నాటకాలుంటాయి. ఇది అనాది అవినాశి నాటకము. ఎప్పుడూ సమాప్తము అయ్యేది కాదు. ఇంత చిన్న ఆత్మకు ఇంత పెద్ద పాత్ర లభించింది. శరీరము తీసుకొనుట, వదులుట, పాత్ర చేయుట ఈ విషయాలు ఏ శాస్త్రాలలోనూ లేవు. దీనిని ఎవరైనా గురువులు వినిపించి ఉంటే వారికి ఇంకను చాలా మంది శిష్యులయ్యేవారు కదా. కేవలము ఒక్క శిష్యుడుంటే దేనికి పనికి వస్తాడు? శిష్యుడు అనగా పూర్తిగా అనుసరించేవాడు. ఇతని డ్రస్సు మొదలైనవేవీ వారిలా లేవు. మరి ఇతడిని శిష్యుడు అని ఎవరంటారు? ఇచ్చట తండ్రి చదివిస్తున్నారు. ఆ తండ్రినే అనుసరించాలి. మగపెళ్ళి వారి ఊరేగింపు ఉంటుంది కదా. అలాగే శివుని ఊరేగింపు అని కూడా అంటారు. తండ్రి అంటున్నారు - ఇది నా పెళ్ళి గుంపు. మీరందరూ భక్తులు, నేను భగవంతుడను. మీరంతా ప్రేయసులు, మిమ్ములను అలంకరించి తీసుకొని వెళ్ళుటకై బాబా వచ్చారు. మరి మీకు ఎంత సంతోషముండాలి! ఇప్పుడు మీరు సృష్టి ఆది మధ్యాంతములను తెలుసుకున్నారు. మీరు తండ్రిని స్మృతి చేస్తూ చేస్తూ పవిత్రమైపోతారు. పవిత్రమైతే పవిత్రరాజ్యము లభిస్తుంది. నేను వచ్చేది అంతములో అని తండ్రి తెలిపిస్తున్నారు. నన్ను పిలిచేదే పావన ప్రపంచ స్థాపనకు, పతిత ప్రపంచ వినాశనము చేయించుటకు. అందుకే నన్ను మహాకాలుడు అని కూడా అంటారు. మహాకాలుని మందిరము కూడా ఉంటుంది. కాలుని మందిరాలు చూస్తున్నారు కదా. శివుని కాలుడు అని అంటారు కదా. వచ్చి పావనముగా చేయమని వారిని పిలుస్తారు. వారు ఆత్మలను తీసుకెళ్తారు. అనంతమైన తండ్రి అనేక ఆత్మలను తీసుకొని పోవుటకు వచ్చారు. కాలులకు కాలుడు మహాకాలుడు. ఆత్మలన్నిటిని పవిత్రముగా, సుగంధభరిత పుష్పాలుగా మార్చి తీసుకొని వెళ్తారు. సుగంధ పుష్పాలుగా తయారైతే తండ్రి కూడా ఒడిలో కూర్చోబెట్టుకొని తీసుకెళ్తారు. పవిత్రముగా తయారు కాకుంటే శిక్షలు అనుభవించవలసి వస్తుంది. పదవి కూడా అలాగే ఉంటుంది. అందుకే తండ్రి తెలిపిస్తున్నారు - మధురమైన పిల్లలూ ! చాలా చాలా మధురముగా తయారుకండి. కృష్ణుడు అందరికీ మధురమనిపిస్తాడు కదా. కృష్ణుని ఊయలలో ఎంత ప్రేమగా ఊపుతారు. ధ్యానములో కృష్ణుని చిన్న బాలునిగా చూసిన వెంటనే ఒడిలోకి తీసుకొని ప్రీతినిస్తారు. వైకుంఠములోకి వెళ్ళిపోతారు. అక్కడ కృష్ణుని చైతన్య రూపమును చూస్తారు. సత్యమైన వైకుంఠము వస్తూ ఉందని ఇప్పుడు పిల్లలైన మీకు తెలుసు. మనము భవిష్యత్తులో ఇలా అవుతాము. శ్రీ కృష్ణునికి కళంకము ఆపాదిస్తారు. అదంతా తప్పే. పిల్లలైన మీకు మొదట నషా పెరగాలి. ప్రారంభములో చాలా సాక్షాత్కారాలు జరిగాయి. తర్వాత చివర్లో చాలా అవుతాయి. ఈ జ్ఞానము

ఎంతో రమణీకమైనది. ఎంత సంతోషముంటుంది! భక్తిమార్గములో సంతోషము ఏ మాత్రము ఉండదు. జ్ఞానములో ఎంత సుఖముందో భక్తి మార్గములోనికి వారికి తెలియనే తెలియదు. దానికి దీనికి పోలికే లేదు. పిల్లలైన మీకు మొదట నషా పెరగాలి. ఈ జ్ఞానమును తండ్రి తప్ప ఏ ఋషులు, మునులు మొదలైన వారెవ్వరూ ఇవ్వలేరు. ఏ లౌకిక గురువులు ఎవ్వరికీ ముక్తి - జీవన్ముక్తికి మార్గమును తెలుపలేరు. ఓ ఆత్మలారా ! ఓ పిల్లలారా ! నేను మీకు తెలిపిస్తున్నాను అని ఏ మనుష్య గురువు కూడా అనలేరని మీకు తెలుసు. తండ్రికైతే పిల్లలూ! పిల్లలూ! అనే అలవాటు ఉంటుంది. ఈ పిల్లలు నా రచన అని వారికి తెలుసు. ఈ తండ్రి కూడా నేను అందరి రచయితను అని అంటారు. మీరంతా సోదరులు. వారికి పాత్ర లభించింది. ఎలా లభించిందో వారు కూర్చుని తెలిపిస్తున్నారు. ఆత్మలోనే పాత్ర అంతా నిండి ఉంది. ఏ మనిషి వచ్చినా 84 జన్మలలో ఒకే విధమైన రూపురేఖలు ఎప్పుడూ ఉండజాలవు. కొద్ది కొద్దిగా మార్పులు తప్పక జరుగుతూనే ఉంటాయి. తత్వములు కూడా సతో, రజో, తమోగా అవుతూ పోతాయి. ప్రతి జన్మలోని రూపు - రేఖలు ఒక దానితో ఒకటి కలువవు. ఇవన్నీ అర్థము చేసుకునే విషయాలు. తండ్రి ప్రతి రోజు తెలియచేస్తున్నారు- మధురమైన పిల్లలూ ! తండ్రిలో ఎప్పుడూ సంశయముండరాదు. సంశయము, నిశ్చయము అను రెండు పదాలు ఉన్నాయి కదా. తండ్రి అనగా తండ్రి. ఇందులో సంశయము ఉండరాదు. తండ్రిని నేను స్మృతి చేయలేనని కొడుకు అనలేడు. మీరు పదే పదే యోగము కుదరదని అంటుంటారు. యోగమనే పదము సరియైనది కాదు. మీరేమో రాజఋషులు. ఋషి అనే పదము పవిత్రతకు సంబంధించినది. మీరు రాజఋషులు, కావున తప్పక పవిత్రముగా ఉంటారు. చిన్న విషయాల్లో ఫెయిల్ అయినా రాజ్య పదవి లభించదు. ప్రజలలోనికి వెళ్ళిపోతారు. ఎంతో నష్టపోతారు. పదవులు నంబరువారుగా ఉంటాయి కదా. ఒకరి పదవి మరొకరితో సమానముగా ఉండదు. ఇది అనంతమైన తయారు చేయబడిన డ్రామా. ఒక్క తండ్రి తప్ప మరెవ్వరూ దీనిని తెలుపలేరు. కావున పిల్లలైన మీకు ఎంత సంతోషముండాలి! తండ్రి బుద్ధిలో ఎలాగైతే మొత్తం జ్ఞానమంతా ఉందో అలా మీ బుద్ధిలో కూడా ఉంది. బీజము, వృక్షమును గురించి అర్థము చేసుకోవాలి. ఇది మానవ సృష్టిరూపి వృక్షము. దీనిని మర్రి వృక్షముతో పోల్చుట చాలా సబబుగా ఉంది. మన ఆదిసనాతన దేవీదేవతా ధర్మపు కాండము ప్రాయ:లోపమైపోయిందని బుద్ధి కూడా చెప్తున్నది. మిగిలిన అన్ని ధర్మముల కొమ్మరెమ్మలు మొదలైనవన్నీ నిలిచి ఉన్నవి. డ్రామానుసారము ఇదంతయు జరిగే తీరాలి. ఇందులో ఏవగింపు రాదు. నాటకములోని పాత్రధారులకు ఎప్పుడైనా ద్వేషము కలుగుతుందా? తండ్రి చెప్తున్నారు - మీరు పతితమైపోయారు, మరలా పావనముగా తయారవ్వాలి. మీరు చూసినంత సుఖము మరెవ్వరూ చూడలేరు. మీరు హీరో హీరోయిన్‌లు. విశ్వరాజ్యమును పొందుకునేవారు. అందువలన అపారమైన సంతోషముండాలి కదా. భగవంతుడు చదివిస్తున్నారంటే ఎంత రెగ్యులర్‌గా చదవాలి! ఎంత సంతోషముండాలి! మమ్ములను అనంతమైన తండ్రి చదివిస్తున్నారు. ఆ తండ్రే రాజయోగమును కూడా నేర్పిస్తున్నారు. ఏ శరీరధారీ నేర్పలేరు. తండ్రి ఆత్మలకు నేర్పించారు. ఆత్మనే ధారణ చేస్తుంది. తండ్రి పాత్ర చేయుటకు ఒక్కసారి మాత్రమే వస్తారు. ఆత్మనే పాత్ర చేసి ఒక్క శరీరము వదలి మరొక శరీరము తీసుకుంటుంది. ఆత్మలను తండ్రి చదివిస్తున్నారు. దేవతలను చదివించరు. అచ్చట దేవతలే చదివిస్తారు. సంగమయుగములో పురుషోత్తములుగా తయారు చేయుటకు తండ్రియే చదివిస్తున్నారు. మీరే చదువుతారు. పురుషోత్తములుగా తయారయ్యేది ఈ

ఒక్క సంగమయుగములోనే. సత్యముగా తయారు చేయువారు, సత్యయుగము స్థాపన చేయువారు ఒక్క సత్యమైన బాబా మాత్రమే. అచ్ఛా. మంచిది.

**మధురాతి మధురమైన అపురూపమైన పిల్లలకు మాత - పిత, బాప్‌దాదాల ప్రియస్మృతులు మరియు గుడ్‌మార్నింగ్ ఆత్మిక పిల్లలకు ఆత్మిక తండ్రి నమస్తే.**

**ధారణ కొరకు ముఖ్య సారము**

1. సంగమ యుగములో నేరుగా భగవంతుని నుండి చదువుకొని, జ్ఞానవంతులుగా, ఆస్తికులుగా తయారవ్వాలి, తయారు చేయాలి. ఎప్పుడు కూడా తండ్రిలో కాని, చదువులో కాని సంశయపడరాదు.
2. తండ్రి సమానముగా లవ్‌లీ(ప్రియము)గా తయారు కావాలి. భగవంతుడు మనలను శృంగారిస్తున్నారనే ఖుషీలో ఉండాలి. ఏ పాత్రధారి పై కూడా తిరస్కార భావన, అసహ్య భావన ఉండరాదు. ప్రతి ఒక్కరికి డ్రామాలో ఖచ్ఛితమైన పాత్ర ఉంది.

## వరదానము:- "బ్రాహ్మణ జీవితములోని ఆస్తిని మరియు పర్సనాలిటీని అనుభవము చేసి చేయించే విశేష ఆత్మ భవ"

బాప్‌దాదా బ్రాహ్మణ పిల్లలందరికీ స్మృతినిప్పిస్తున్నారు - "బ్రాహ్మణులుగా అయ్యారు, ఇది చాలా గొప్ప భాగ్యము కాని బ్రాహ్మణ జీవితములోని వారసత్వము లేక ఆస్తి సంతుష్టత. బ్రాహ్మణ జీవితము యొక్క పర్సనాలిటీ ప్రసన్నత. ఈ అనుభవముతో ఎప్పుడూ వంచితులుగా ఉండిపోరాదు. మీరు అధికారి ఆత్మలు. దాత, వరదాత విశాల హృదయముతో ప్రాప్తుల ఖజానానిస్తున్నారంటే వాటిని అనుభవములోకి తీసుకురండి, ఇతరులను కూడా అనుభవీలుగా చెయ్యండి. అప్పుడు విశేషాత్మ అని అంటారు.

## స్లోగన్:- " చివరి సమయము గురించి ఆలోచించుటకు బదులు చివరి స్థితిని గురించి ఆలోచించండి "